రష్మిక జోడీకి టైటిల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇండోర్ టెన్నిస్ క్లబ్ వేదికగా జరిగిన ఐటీఎఫ్ వరల్డ్ టెన్నిస్ టూర్ టోర్నీలో శ్రీవల్లి రష్మిక, వైదేహి చౌదరీ జోడీ విజేతగా నిలిచింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో రష్మిక, వైదేహి ద్వయం 6-3, 7-5తో హుసన్ లీ, సోహున్ పార్క్ జోడీపై విజయం సాధించింది. ఆది నుంచే తమదైన జోరు కనబరిచిన రష్మిక, వైదేహి..ప్రత్యర్థి జంటను వరుస సెట్లలో చిత్తు చేసింది.

సాఫ్ట్‌బాల్ విజేత నిజామాబాద్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆదిలాబాద్ వేదికగా జరిగిన రాష్ట్ర సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో నిజామాబాద్ విజేతగా నిలిచింది. శనివారం పూర్తి ఏకపక్షంగా సాగిన పోరులో నిజామాబాద్ సాంఘిక గురుకుల పాఠశాల 10-0 తేడాతో ఆదిలాబాద్‌పై ఘన విజయం సాధించింది. టోర్నీలో వేర్వేరు గురుకులాలకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచారు.

అమ్మాయిల హాస్టల్‌లోకి అచింత

జాతీయ క్యాంప్ నుంచి వెయిట్‌లిఫ్టర్ ఔట్

న్యూఢిల్లీ: భారత యువ వెయిట్‌లిఫ్టర్ అచింతా చెహులీ చిక్కుల్లో పడ్డాడు. పారిస్ ఒలింపిక్స్ సన్నాహక శిబిరం కోసం ప్రస్తుతం జాతీయ క్రీడా అకాడమీ(ఎన్ఐఎస్) పటియాలలో శిక్షణ పొందుతున్న అచింత.. అమ్మాయిల హాస్టల్‌లోకి ప్రవేశించాడు. క్రీడా అకాడమీ నిబంధనలు ఉల్లంఘించిన అచింతను క్యాంప్ నుంచి తప్పిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అమ్మాయిల హాస్టల్‌లోకి అచింత వెళ్తున్న వీడియో సాక్ష్యాధారాలు ఉన్నట్లు ఎన్ఐఎస్ పటియాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీత్‌కుమార్ శనివారం పేర్కొన్నాడు. 'ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. అతన్ని వెంటనే క్యాంప్ విడిచిపెట్టి వెళ్లాలని ఆదేశించాం. వీడియోను ఢిల్లీలోని సాయ్ ప్రధాన కేంద్ర కార్యాలయంతో పాటు జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌కు కూడా పంపాం. ఇప్పటికైతే సాయ్ ఎలాంటి విచారణ ప్యానెల్ ఏర్పాటు చేయలేదు' అని కుమార్ అన్నారు. అచింతపై వేటుతో ఈ నెలలో థాయ్‌లాండ్‌లో జరిగే ఐడబ్ల్యూఎఫ్ ప్రపంచకప్ టోర్నీకి దూరమయ్యాడు. ఈ కారణంగా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాన్ని ఈ వెయిట్‌లిఫ్టర్ చేజార్చుకున్నాడు.

టైటిల్ ఫైట్

రాత్రి 7.30 స్పోర్ట్స్-18లో

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో టైటిల్ ఫైట్‌కు వేళయైంది. ఐపీఎల్‌కు ఏమాత్రం తీసిపోకుండా అభిమానులను అలరిస్తున్న అమ్మాయిలు ఆఖరి పోరుకు సై అంటున్నారు. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అమీతుమీ తేల్చుకోనున్నాయి. సమిష్టి ప్రదర్శనతో ఢిల్లీ టాప్ లేపితే..పడుతూ లేస్తూ సాగిన బెంగళూరు..ముంబైని పడగొట్టి ఫైనల్ చేరింది. లీగ్‌లో తొలిసారి టైటిల్‌ను ముద్దాడాలని చూస్తున్న ఇరు జట్ల మధ్య పోరు అభిమానులకు పసందైన విందు అందించడం ఖాయంగా కనిపిస్తున్నది.

నేడు ఢిల్లీ, బెంగళూరు తుది సమరం • కప్‌పై కన్నేసిన ఇరు జట్లు • మహిళల ప్రీమియర్ లీగ్

న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్‌లో విజేత ఎవరో మరికొన్ని గంటల్లో తేలనుంది. గత 20 రోజులుగా అభిమానులను అలరిస్తూ వస్తున్న డబ్ల్యూపీఎల్‌లో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ), రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) మధ్య ఫైనల్ పోరు జరుగనుంది. లీగ్‌లో ఆది నుంచి తమదైన దూకుడు ప్రదర్శిస్తూ ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేసిన ఢిల్లీ..లీగ్ దశలో టాప్ లేపితే..ఆర్‌సీబీ ప్రయాణం పడుతూ లేస్తూ సాగింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో ఢిల్లీ రెండింటిలో ఓడితే..ఆర్‌సీబీ నాలుగు గెలిచి, నాలుగింటిలో ఓటమి ఎదుర్కొంది. ఇదిలా ఉంటే ఐపీఎల్‌లో ఇప్పటి వరకు టైటిల్ గెలువని ఢిల్లీ, ఆర్‌సీబీ అమ్మాయిల లీగ్‌లోనైనా తమ కల నెరవేర్చుకోవాలని చూస్తున్నాయి. గత లీగ్‌లో ముంబై చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకున్న ఢిల్లీ ఈసారి సొంతగడ్డపై ఆ ముచ్చట తీర్చుకోవాలని చూస్తుంటే..' ఈ సాలా కప్ నమదే' అంటూ ప్రతీ సీజన్‌లో స్లోగన్ ఎత్తుకునే ఆర్‌సీబీ కొత్త చరిత్ర నాంది పలుకాలని పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో ఎవరు గెలిచినా మొదటిసారే కావడం అభిమానులకు సంతోషాన్ని ఇవ్వనుంది.

ఢిల్లీ X బెంగళూరు:

ఈ సీజన్‌లో మెగ్ ల్యానింగ్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ దుమ్మురేపుతున్నది. లీగ్ ఆరంభం నుంచి ప్రత్యర్థి ఎవరన్నది లెక్క చేయని నైజంతో గెలుపే లక్ష్యంగా దూసుకెళుతున్నది. నిరుడు సీజన్‌లో టైటిల్‌ను ముంబైకి చేజార్చుకున్న ఢిల్లీ.. ఈసారి అలాంటి తప్పు పునరావృతం చేసేందుకు ప్రయత్నించకపోవచ్చు. లీగ్ మొత్తమ్మీద చూసుకుంటే కెప్టెన్ ల్యానింగ్ సూపర్ ఫామ్‌మీదుంది. ఎనిమిది మ్యాచ్‌ల్లో 308 పరుగులతో ఎలీస్ పెర్రీ(312) తర్వాత రెండో స్థానంలో ఉంది. బౌలింగ్ విషయానికొస్తే డీసీ బౌలర్లు మారిజానె కాప్(11), జెస్ జొనాసెన్(11) టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నారు. వీరికి తోడు ఓపెనర్ షెఫాలీవర్మ, జెమీమా రోడ్రిగ్స్ మంచి టచ్‌లో ఉన్నారు. వీరిలో ఏ ఒక్కరు నిలదొక్కుకున్నా..డీసీ కల నెరవేరినట్లే. బౌలింగ్‌లో శిఖాపాండే, రాధాయాదవ్ రాణిస్తే.. ఢిల్లీకి తిరుగుండదు. ఆర్‌సీబీని ఆల్‌రౌండర్ ఎలీస్ పెర్రీ ముందుండి నడిపిస్తున్నది. చివరి లీగ్ మ్యాచ్‌తో పాటు ముంబైతో కీలకమైన ఎలిమినేటర్‌లో పెర్రీ సత్తాచాటింది. అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో రాణిస్తూ ఆర్‌సీబీని ఫైనల్ చేర్చడంలో కీలకమైంది. ఇదే దూకుడు తుదిపోరులోనూ కొనసాగిస్తే..ఆర్‌సీబీని అదృష్టం వరించినట్లే. కెప్టెన్ మందన, రీచా ఘోష్, శ్రేయాంకా పాటిల్, ఆశా శోభన సత్తాచాటితే ఆర్‌సీబీ కప్ కల తీరినట్లే. ఈ సీజన్‌లో బెంగళూరుతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఢిల్లీ గెలువడం కలవర పెట్టే అంశం.

జట్ల అంచనా

ఢిల్లీ: ల్యానింగ్(కెప్టెన్), షెఫాలీ, క్యాప్సె, రోడ్రిగ్స్, జొనాసెన్, కాప్, మిన్ను మణి, భాటియా, రాధ, అరుంధతి, శిఖాపాండే.

బెంగళూరు: మందన(కెప్టెన్), డివైన్, పెర్రీ, దిశాకసత్/మేఘన, రీచ, మిలోనెక్స్, వేర్‌హామ్, శ్రేయాంక, రేణుక, ఆశ, శ్రద్ధా/ఏక్తాబిస్ట్.

ఫైనల్లో స్వియాటెక్

ఇండియన్ వెల్స్ టోర్నీ

ఇండియన్ వెల్స్(అమెరికా): ఇండియన్ వెల్స్ టోర్నీలో పోలాండ్ స్టార్ ఇగా స్వియాటెక్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో టాప్ ర్యాంకర్ స్వియాటెక్ 6-2, 6-1తో మార్టా కోత్సుక్‌పై అలవోక విజయం సాధించింది. దీంతో ఈ ఏడాది స్వియాటెక్ విజయాల సంఖ్య 19-2కు చేరుకుంది. సెమీస్ చేరుకునే వరకు స్వియాటెక్ కేవలం 17 గేములు చేజార్చుకుంది. మ్యాచ్ విషయానికొస్తే.. కొత్సుక్ నాలుగుసార్లు డబుల్ ఫాల్ట్స్ చేస్తే.. స్వియాటెక్ సున్నాకు పరిమితమైంది. స్వియాటెక్ తన తొలి సర్వ్‌లో 74 శాతంతో ఉంటే కొత్సుక్ 50 శాతంతో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగే ఫైనల్లో గ్రీస్ ప్లేయర్ మారియా సకారితో స్వియాటెక్ తలపడుతుంది.

రానున్న ఐపీఎల్ సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ సిద్ధమవుతున్నది. శనివారం చండీగఢ్‌లో జట్టు కొత్త జెర్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రాంచైజీ సహ యజమాని ప్రీతిజింతా, కెప్టెన్ శిఖర్ ధవన్, అర్ష్‌దీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ భారత్‌లోనే: అరుణ్

న్యూఢిల్లీ: ఐపీఎల్ టోర్నీ నిర్వహణపై గత కొన్ని రోజులుగా వస్తున్న వార్తలకు లీగ్ చైర్మన్ అరుణ్ ధుమాల్ ఫుల్‌స్టాప్ పెట్టాడు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారత్ బయట యూఏఈలో ఐపీఎల్ జరిగే అవకాశముందంటూ వార్తలు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో అరుణ్ స్పష్టత నిచ్చే ప్రయత్నం చేశాడు. శనివారం లోక్‌సభ ఎన్నికల తేదీలు విడుదలైన క్రమంలో ఆయన స్పందించాడు. ఎట్టి పరిస్థితుల్లో ఐపీఎల్‌ను భారత్ బయటకు మార్చే ఉద్దేశం లేదని శనివారం ఆయన స్పష్టం చేశాడు. త్వరలోనే మిగిలిన షెడ్యూల్‌ను విడుదల చేస్తామని అన్నాడు. ఇప్పటికే రెండు వారాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించిన ఐపీఎల్ పాలకవర్గం..పూర్తి స్థాయి మ్యాచ్‌ల తేదీలు, వేదికలను ప్రకటిస్తుందని వివరించాడు.

లక్ష్యసేన్ నిష్క్రమణ

బర్మింగ్‌హామ్: ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్ లక్ష్యసేన్ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో సెమీఫైనల్లో లక్ష్యసేన్ 21-12, 10-21, 15-21తో జొనాథాన్ క్రిస్టి(ఇండోనేషియా) చేతిలో ఓటమిపాలయ్యాడు. 2022లో రన్నరప్‌గా నిలిచిన లక్ష్యసేన్..మరోమారు ఫైనల్లోకి దూసుకెళ్లేందుకు చేసిన ప్రయత్నం నెరవేరలేదు. గత వారం ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌కు చేరుకున్న లక్ష్యసేన్ 11 రోజులుగా విరామం లేకుండా ఆడుతున్నాడు.



నమస్తే తెలంగాణ Telangana Today PRESENT

లక్షల మందిని చేరుకునే సలక్షణ వేదిక

అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నిజామాబాద్ మరియు పరిసర ప్రాంతాల్లోని అన్ని ప్రముఖ సంస్థల ప్రాపర్టీలు, హైదరాబాద్‌లోని ప్రఖ్యాత రియాల్టీ ప్రాపర్టీలు ఒకే వేదికపైన మరియు తక్షణ రుణ సదుపాయం కొరకు ప్రముఖ జాతీయ బ్యాంకులు కూడా అదే వేదికపై అందుబాటులో ఉంటాయి.

22 - 23, మార్చి 2024

వేదిక: ఓల్డ్ కలెక్టర్ గ్రౌండ్, జిల్లా కోర్టు ఎదురుగా, నిజామాబాద్

Gift Sponsor | TV Sponsor

Associate Sponsor: PRIME ESTATES

In Association With: MODI PROPERTIES, FAIRMOUNT, SRI ASHOKA BUILDERS & DEVELOPERS, BHOOMI SPACE, GR, ROYALOAK, NORTH CREST, SBI, AMRUTHA, SVC, Union Bank

Booking Enquiry: Hyderabad - 9182777723, Nizamabad - 9182777399

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.